సాక్షి
అనకాపల్లి
సోమవారం । 12 । జూన్ । 2023



ప్రారంభోత్సవాలకు వేళాయె!

నాతవరం ప్రగతి పథంలో దూసుకు పోతోంది. పలు భవనాలు, ఆలయాలను సోమవారం ప్రారంభించనున్నారు. 8లో



నిప్పుల వాన

కొద్ది రోజులుగా జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఎండవేడిని భరించలేక జనం అల్లాడిపోతున్నారు. 8లో



ఐదెకరాల్లో తోటలు దగ్ధం


వాకపల్లిలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో 5 ఎకరాల్లోని చెరకు కార్శి తోట, యూకలిప్టస్ తోటలు దగ్ధమయ్యాయి. 8లో

మోగనున్న బడిగంట

- నేటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం
- ఎండల తీవ్రతతో వారం రోజుల పాటు ఒంటి పూట బడులు
- ప్రభుత్వ స్కూళ్లలో ఉదయం రాగిజావ, ఆ తరువాత మధ్యాహ్న భోజనం
- 19 నుంచి యథావిధిగా పాఠశాలలు
- జిల్లాలో తెరుచుకోనున్న 1,924 బడులు
- సర్వం సిద్ధం చేసిన విద్యా శాఖ అధికారులు
- తొలి రోజున విద్యాకానుక అందించేందుకు ఏర్పాట్లు



కోడూరు పాఠశాల



మనబడి నాడు-నేడు
మొదట విడతలో
అభివృద్ధి చేసిన పాఠశాలలు: 598
వెచ్చించిన నిధులు :
రూ.156.44 కోట్లు
రెండో విడత
అభివృద్ధి చేస్తున్న పాఠశాలలు : 616
మంజూరైన నిధులు : రూ.210 కోట్లు

జిల్లా విద్యా సమాచారం
ప్రాథమిక పాఠశాలలు - 1,152
ప్రాథమికోన్నత పాఠశాలలు - 341
ఉన్నత పాఠశాలలు - 431
మొత్తం పాఠశాలలు - 1,924
విద్యార్థుల సంఖ్య - 2,21,788
మొత్తం ఉపాధ్యాయులు- 10,412

సాక్షి, అనకాపల్లి: వేసవి సెలవుల అనంతరం జిల్లాలోని పాఠశాలలు సోమవారం తెరుచుకోనున్నాయి. 2023–24 విద్యా సంవత్సరం క్యాలెండర్‌కు అనుగుణంగా తరగతులు ప్రారంభం కానున్నాయి. అయితే ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థుల తల్లిదండ్రులు, వివిధ వర్గాల వారి నుంచి వచ్చిన విజ్ఞాపనలను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఈ నెల 17 వరకు ఒంటి పూట మాత్రమే పాఠశాలలు నిర్వహించేలా ఆదేశాలు ఇచ్చింది. ఈ నేపథ్యంలో సోమవారం నుంచి ప్రతి రోజూ ఉదయం 7.30 నుంచి 11.30 వరకు పాఠశాలలను నిర్వహించనున్నారు. ఉదయం 8.30 నుంచి 9 గంటల మధ్యలో విద్యార్థులకు రాగిజావ అందజేయనున్నారు. 11.30 గంటల తరువాత మధ్యాహ్న భోజనం పెట్టి విద్యార్థులను ఇళ్లకు పంపించనున్నారు. ఈ నెల 19 నుంచి రెండు పూటలా పాఠశాలలను నిర్వహించాల్సి ఉంటుందని డీఈవో వెంకట లక్ష్మమ్మ తెలిపారు.

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలోని అన్ని పాఠశాలలు ఇదే రీతిన పనిచేయాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. పాఠశాలల ప్రారంభం రోజే విద్యా కానుక అందించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

మెరిసిపోతున్న ప్రభుత్వ బడులు

నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా మౌలిక వసతులు కల్పించడంతో పాటు భవనాల రూపురేఖలు మార్చడంతో ప్రభుత్వ పాఠశాలలు అద్దంలా మెరుస్తున్నాయి. జిల్లాలో తొలి దశలో రూ.156.44 కోట్లతో 598 పాఠశాలలను అభివృద్ధి చేయగా, రెండో దశలో రూ.210 కోట్లతో 616 పాఠశాలల్లో పనులు చేపట్టారు. రెండో విడతలో పనులు దాదాపు పూర్తి కావచ్చాయి. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ప్రాధాన్యతా క్రమంలో పనులు పూర్తి చేసేలా సమగ్ర శిక్ష అభియాన్ ఇంజినీరింగ్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. తొలి దశలో అభివృద్ధి చేసిన పాఠశాలల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఉన్న చోట అదనపు తరగతి గదుల నిర్మాణానికి ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థులను రా రమ్మంటూ ఆహ్వానిస్తున్నాయి.

అడ్మిషన్లపై స్పెషల్ డ్రైవ్

ప్రభుత్వ స్కూళ్లలో అడ్మిషన్లు పెరిగేలా స్పెషల్ డ్రైవ్‌పై జిల్లా విద్యాశాఖాధికారులు దృష్టి సారించారు. ప్రధానంగా అంగన్‌వాడీల నుంచి వచ్చే పిల్లలంతా తప్పనిసరిగా ప్రభుత్వ స్కూళ్లలోనే చేరేలా ప్రత్యేక ఫోకస్ పెట్టారు. అదే విధంగా ప్రైమరీ, యూపీఎస్‌ల నుంచి పై తరగతులకు వచ్చే విద్యార్థుల వివరాలను సేకరించి, వారిని ప్రభుత్వ బడుల్లోనే చేర్పించేలా ప్రధానోపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారులు ఆదేశించారు.

ప్రైవేట్ స్కూళ్లలోనూ ఒంటి పూట



జిల్లాలోని అన్ని స్కూళ్లను సోమవారం నుంచి తెరవాలి. ఎండల తీవ్రత దృష్ట్యా విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని పాఠశాలల హెచ్‌ఎంలకు ఆదేశాలు ఇచ్చాం. వారం రోజుల పాటు ఒంటిపూట బడులు నిర్వహించనున్నారు. ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఒంటిపూట అమలు చేయాలని ఆదేశించాం. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగానే ప్రైవేట్ యాజమాన్యాలు నడుచుకోవాలి. ప్రభుత్వ ఆదేశాలు ధిక్కరించే స్కూళ్ల యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటాం. – వెంకట లక్ష్మమ్మ, డీఈవో, అనకాపల్లి

సా మిల్లులో భారీ అగ్నిప్రమాదం

- రూ.8లక్షల ఆస్తి నష్టం



మంటల్లో దగ్ధమవుతున్న కలప

యలమంచిలి: పట్టణంలోని పోస్టాఫీసు ఎదురుగా గల భవనం వీధిలో ఉన్న శ్రీలక్ష్మీ గణపతి సా మిల్లులో ఆదివారం భారీ అగ్నిప్రమాదం జరిగింది. సా మిల్లు యజమాని కట్టా సత్యనారాయణ ఫిర్యాదు మేరకు యలమంచిలి అగ్నిమాపకశాఖ అధికారి డి.రాంబాబు సిబ్బందితో హుటాహుటిన ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. పెద్ద ఎత్తున మంటలు చెలరేగడంతో నక్కపల్లి నుంచి మరో అగ్నిమాపక వాహనాన్ని రప్పించి తీవ్రంగా శ్రమించి రాత్రి 7.30 గంటలకు మంటలను అదుపు చేశారు. భారీగా మంటలు చెలరేగడంతో స్థానిక నాగేంద్ర కాలనీ, భవనం వీధిలో నివాసం ఉంటున్న ప్రజలు తీవ్ర భయాందోళనకు గురయ్యారు. దట్టమైన పొగ వ్యాపించడంతో అటుగా వెళ్లిన వారు ఇబ్బంది పడ్డారు. ఈ ప్రమాదంలో రూ.8 లక్షల విలువ చేసే కలప, యంత్ర సామగ్రి అగ్నికి ఆహుతి అయినట్టు అగ్నిమాపక శాఖాధికారి డి.రాంబాబు తెలిపారు.



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

న్యూస్‌రీల్

వడగాడ్పులకు తమిళనాడు లారీ డ్రైవర్ మృతి



పడుకున్న చోటే మృతి చెందిన లారీ డ్రైవర్

అచ్యుతాపురం (అనకాపల్లి): వడగాడ్పులకు తాళలేక అచ్యుతాపురం మండలం ఇరువాడ జంక్షన్ వద్ద ఓ లారీ డ్రైవర్ మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. చిత్తూరు జిల్లాకు 40 కిలోమీటర్ల దూరంలో ఉన్న తమిళనాడు రాష్ట్రంలోని అవరకరై గ్రామానికి చెందిన డ్రైవర్ కమల్‌నాథ్(49) శనివారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో పెట్రోల్ బంక్ సమీపంలో లారీ ఆపి, కింద దుప్పటి పరుచుకుని పడుకున్నాడు. ఎవరో పడుకున్నారని అక్కడి వారు భావించారు. అయితే ఆదివారం ఉదయం కూడా డ్రైవర్ లేవకపోవడంతో అనుమానం వచ్చిన వారు పరిశీలించగా అప్పటికే ఆ డ్రైవర్ మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. లారీ వద్ద డ్రైవర్ పడుకున్న దృశ్యాలు ఇరువాడ పెట్రోల్ బంక్ వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డు అయ్యాయి.

దివ్యాంగ స్నేహితునికి రూ. లక్ష సాయం



దివ్యాంగుడు అప్పారావుకు నగదును అందిస్తున్న స్నేహితులు

కె.కోటపాడు: తమతోపాటు చదువుకున్న దివ్యాంగుడు డెక్క అప్పారావుకు రూ.లక్ష సాయం అందించి తోటి స్నేహితులు పెద్దమనసు చాటుకున్నారు. కొరువాడ హైస్కూల్‌లో 1996–97 విద్యాసంవత్సరంలో పదవ తరగతి వరకు చదివిన విద్యార్థుల ఆత్మీయ కలయికను ఆదివారం పాఠశాలలో నిర్వహించారు. తమతో చదువుకున్న గవరపాలెంకు చెందిన డెక్క అప్పారావు ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నట్టు తెలుసుకున్నారు. అండగా నిలవాలని సంకల్పించుకున్నారు. దీంతో వారంతా రూ.లక్ష నగదును సమీకరించి అప్పారావు ఇంటికి వెళ్లి అందజేశారు. అండగా నిలిచిన స్నేహితులకు అప్పారావు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రశాంతంగా మోడల్ స్కూల్స్ ప్రవేశ పరీక్ష

అనకాపల్లిటౌన్: జిల్లాలోని ఐదు ప్రభుత్వ మోడల్ పాఠశాలల్లో 6వ తరగతిలో ప్రవేశానికి ఆదివారం నిర్వహించి పరీక్ష ప్రశాంతంగా జరిగినట్టు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మ చెప్పారు. జిల్లాలో తేగాడ, పాటిపల్లి మోడల్ స్కూళ్లలో పరీక్షా కేంద్రాలను ఆదివారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 1,450 మంది విద్యార్థులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నట్టు చెప్పారు. 1,178మంది పరీక్ష రాయగా, 272మంది గైర్హాజరైనట్టు తెలిపారు. మునగపాక మండలంలో పాటిపల్లి, కోటకోట మండలంలో తేగాడ, రావికమతం మండలంలో మర్రిపాక, చీడికాడ మండలంలో మలసాల, నర్సీపట్నం మండలంలో వేములపూడి మోడల్ పాఠశాలల్లో ప్రవేశానికి పరీక్ష నిర్వహించినట్టు చెప్పారు.

చోడవరం విద్యార్థిని ప్రతిభ

- ఒకే సారి రెండు ఐఐటీల్లో పీజీ సీటు



సంహితకు స్వీట్ తినిపించి ఆనందం వ్యక్తంచేస్తున్న తల్లిదండ్రులు

చోడవరం: ప్రతిష్టాత్మకమైన చెన్నై, ముంబై ఐఐటీల్లో చోడవరానికి చెందిన భోగవిల్లి సంహిత ఎంటెక్ సీటు దక్కించుకుంది. మొదట్నుంచీ చదువులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సంహిత మాస్టర్ డిగ్రీ చేసేందుకు ఇటీవల నిర్వహించిన ఎంటెక్ ప్రవేశపరీక్షలో 9.09 గ్రేడ్ పాయింట్లు సాధించడంతో మద్రాసు, ముంబై ఐఐటీల్లో సీటు లభించింది. చోడవరం పట్టణానికి చెందిన భోగవిల్లి శ్రీనివాసగుప్తా, కవిత దంపతులకు ఇద్దరు కుమార్తెలు. మొదటి కుమార్తె సాత్విక గ్రీస్‌లో చదువుతోంది. రెండో కుమార్తె సంహిత తిరుపతి ట్రిపుల్ ఐటీలో బీటెక్ చదివింది. ముంబై ఐఐటీలో తాను చేరనున్నట్టు సంహిత చెప్పింది.

నేడు జగనన్న విద్యా కానుక పంపిణీ

- అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవం
- డిప్యూటీ సీఎం, మంత్రి, ఎంపీ హాజరు
- ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గణేష్, ఏఎస్పీ రాణా



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్



బందోబస్తు ఏర్పాట్లను పరిశీలిస్తున్న నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

నాతవరం : మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంతో పాటు, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీ బీవీ సత్యవతి రానుండటంతో సభా ఏర్పాట్లను ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, నర్సీపట్నం ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఆదివారం వేర్వేరుగా పరిశీలించారు. పీహెచ్‌సీలో రూ.కోటి 65 లక్షలతో నిర్మించిన అదనపు భవనాన్ని పరిశీలించి, వైద్యాధికారులకు, ఆర్‌అండ్‌బీ అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. రెండు సచివాలయ భవనాలు, ఆర్బీకే, పశు వైద్యశాల నూతన భవనాలను పరిశీలించి సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడారు. నాతవరం గ్రామ సమీపంలో తాండవ కాలువ గట్టుపై రూ.10 లక్షలతో నిర్మించిన శ్రీనల్లకొండమ్మ తల్లి ఆలయాన్ని పరిశీలించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని జిల్లాలోని నాతవరం హైస్కూల్లో ఏర్పాటు చేశారు. అక్కడి స్టాల్స్ ఏర్పాటును పరిశీలించి, ఇన్‌చార్జి ఎంపీడీవో పోలుపర్తి పార్థసారథి, ఎంఈవో తాడి అమృత్ కుమార్‌కు సూచనలిచ్చారు. అనంతరం పార్టీ శ్రేణులతో సమావేశమై తొలిసారిగా మండలానికి ఇద్దరు మంత్రులు, ఎంపీ రావడంతో పాటు, జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీ కార్యక్రమాన్ని ఇక్కడే ఏర్పాటు చేయడంతో, సభలు, సమావేశాలను విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు. అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందుజాగ్రత్తలో భాగంగా ఏఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా మంత్రులు పర్యటించే ప్రాంతాలను క్షుణంగా పరిశీలించారు. బందోబస్తు ఏర్పాట్లపై నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య, ఎస్‌ఐ డి.లక్ష్మీనారాయణలకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎమ్మెల్యే వెంట ఎంపీపీ సాగిన లక్ష్మణమూర్తి, వైస్ ఎంపీపీ పైల సునీల్, పార్టీ మండల అధ్యక్షుడు లగుడు నాగేశ్వరరావు, కార్పొరేషన్ల రాష్ట్ర డైరెక్టర్లు శిరుసుపల్లి నర్సింగరావు, పైల పోతురాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ శ్రేణులు, అధికారులు పాల్గొన్నారు.

థ్యాంక్యూ సీఎం సార్



తారువలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సమక్షంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లు

- వై.ఎస్. జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి కాంట్రాక్ట్ లెక్చరర్ల క్షీరాభిషేకం
- డిప్యూటీ సీఎం బూడి సమక్షంలో హర్షాతిరేకాలు వ్యక్తం

దేవరాపల్లి: ప్రభుత్వ కళాశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ లెక్చరర్లను రెగ్యులర్ చేస్తూ మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రకటించినందుకు కాంట్రాక్ట్ లెక్చరర్లు హర్షాతిరేఖాలు వ్యక్తం చేశారు. తారువలోని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయంలో మంత్రి బూడి ముత్యాలనాయుడు సమక్షంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రపటానికి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. రెగ్యులర్ చేసిన సీఎం జగన్‌తో పాటు సహకరించిన డిప్యూటీ సీఎం బూడికి కృతజ్ఞతలు తెలియజేశారు. డిప్యూటీ సీఎంను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బి.ఎస్.ఆర్. శర్మ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం రెగ్యులర్ చేసిన సీఎంకు తామంతా జీవితాంతం రుణపడి ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ లెక్చరర్ల అసోసియేషన్ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి అప్పారావు, గొర్రుపోటు పార్థసారథి, రామకోటి, కోటేశ్వరరావు, లక్ష్మణరావు, రమణ, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృత్యంతర శిక్షణ విజయవంతం



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ మాణిక్యంనాయుడు(ఫైల్)



బోధనాభ్యసన సామగ్రిని ప్రదర్శిస్తున్న ఉపాధ్యాయులు

- నెరవేరిన ప్రభుత్వ లక్ష్యం
- 2018, 2008, 1998 డీఎస్సీ ఉపాధ్యాయులకు 5 వారాల శిక్షణ
- విద్యార్థులకు మరింత సులభతర, ఆసక్తికర బోధనకు దోహదం

అచ్యుతాపురం(అనకాపల్లి): నాణ్యమైన బోధన, సులభతర అభ్యసనం దిశగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరనుంది. 1998, 2008 డీఎస్సీల్లో నష్టపోయిన ఉపాధ్యాయులకు ఎంటీఎస్ ఉద్యోగాలు ఇచ్చేటపుడు సీఎం జగన్ చేసిన దిశా నిర్దేశానికి అనుగుణంగా విశాఖ డైట్ సిబ్బంది వృత్యంతర శిక్షణను అందించారు. మండు వేసవిలోనూ నూతన ఉపాధ్యాయులు(ఎంటీఎస్) ఈ శిక్షణను ఆస్వాదించారు. ఉమ్మడి జిల్లాలో నియమితులైన 2008, 1998 డీఎస్సీ ఉపాధ్యాయులతోపాటు 2018 డీఎస్సీ 2023–24 విద్యా సంవత్సరంలో విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఈ శిక్షణ ఎంతగానో దోహదపడిందని చెప్తున్నారు.

ఎఫ్ఎల్ఎన్, నిపుణ్ భారత్‌పై అవగాహన

ఉమ్మడి విశాఖ జిల్లాలో 600 మంది ఎంటీఎస్ ఉపాధ్యాయులకు తోడు 2018 డీఎస్సీ ఉపాధ్యాయులకు వృత్యంతర శిక్షణ ఇచ్చారు. దీనికి డైట్ ప్రిన్సిపాల్ నేతృత్వంలో 40 మందికి పైగా రిసోర్స్‌పర్సన్స్ ఐదు వారాల పాటు శ్రమించారు. పెందుర్తిలో రెండు విడతలు, అనకాపల్లిలో రెండు విడతలుగా ఈ శిక్షణ జరిగింది. 2016 తర్వాత జరిగిన వృత్యంతర శిక్షణ కావడంతో ఈ ఇండక్షన్ ట్రైనింగ్‌కు ప్రాధాన్యత ఏర్పడింది.

కొత్తగా అమలు చేయాలని భావిస్తున్న ఎఫ్ఎల్ఎన్(ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ), నిపుణ్ భారత్, నూతన విద్యా విధానం(ఎన్ఈపీ), విద్యా హక్కు చట్టం(ఆర్టీఈ) వంటి అంశాలపై ఉపాధ్యాయులకు మార్గనిర్దేశం చేశారు.

విద్యార్థులే కేంద్రంగా బోధన

ఈ శిక్షణలో విద్యార్థులే కేంద్రంగా బోధన జరగాలని, దానికి తీసుకోవాల్సిన చర్యలపై కూలంకషంగా వివరించారు. ముఖ్యంగా తరగతి గదిలో విద్యార్థిని సంసిద్ధం చేయడం, అక్షరాలు నేర్చుకునే రీతి, బోధనాభ్యసన సామగ్రి వాడే విధానం, పరిసరాలతో మమేకం ద్వారా అభ్యసనం, రాగయుక్తంగా పద్యాలు, రైమ్స్ పాడిస్తూ విద్యార్థుల్లో ఆసక్తిని రేకెత్తించడం వంటి అంశాలపై డైట్ సిబ్బంది బోధించిన తీరు అమోఘమని శిక్షణలో పాల్గొన్న నూతన ఉపాధ్యాయులు అంటున్నారు.

పెరిగిన ఆత్మవిశ్వాసం

ఉపాధ్యాయుని డైరీ, లెసన్ ప్లాన్, వార్షిక ప్రణాళిక, పాఠశాల రికార్డులు, తల్లిదండ్రులతో మెలగాల్సిన విధానంపై పూసగుచ్చినట్లు చెప్పి, భావి పౌరుల్ని తీర్చిదిద్దే గురుతర బాధ్యత కలిగిన గురువుల్లో నైపుణ్యం పెంచారు. దీంతో వీరికి ఆయా రికార్డుల తయారీ, వాటి వినియోగంపై ఉన్న భయాలు పోయి, ఆత్మవిశ్వాసం పెరిగింది.

చక్కని ప్రణాళికతో శిక్షణ

ఇండక్షన్ ట్రైనింగ్‌పై సందేహాలు, నిరాసక్తితో వెళ్లిన కొత్త ఉపాధ్యాయులకు చక్కని ప్రణాళికను అందించడంలో డైట్ సిబ్బంది సఫలీకృతమయ్యారు. మంచి టీచరుగా ఎదగాలంటే అవలంబించాల్సిన తీరు, విద్యా పథకాలు, 21వ శతాబ్దానికి తగ్గట్టుగా సాంకేతికత వైపు ఉపాధ్యాయుని పయనం, కొత్త పాఠ్యపుస్తకాల్లో క్యూర్ కోడ్‌ల ఉపయోగం, గణితం, ఈవీఎస్ విద్యా ప్రమాణాలు, బోధనాభ్యసన పద్ధతులు, భాషా స్వభావంపై చక్కని శిక్షణ అందిందని కొత్త ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

శిక్షణతో ఎంతో మేలు

ఇండక్షన్ ట్రైనింగ్ ఇచ్చేందుకు మా రిసోర్స్ పర్సన్స్ ఈ వేసవిలో ఎంతగానో కృషి చేశారు. మంచి నాణ్యతతో కూడిన ఉపాధ్యాయుల ద్వారా బోధన జరగాలని ప్రభుత్వం ఆశిస్తోంది. విద్యార్థులకు చక్కని బోధన అందించాల్సింది ఉపాధ్యాయులే. అందుకే వారికి ఏటా ఇలాంటి శిక్షణ అవసరం. ఉపాధ్యాయులు కూడా దీన్ని సద్వినియోగం చేసుకున్నారు.

– మాణిక్యం నాయుడు, డైట్ ప్రిన్సిపాల్

అమ్మ పుట్టిన రోజు...అందరికీ పండగే



ఆత్మీయంగా కలుసుకున్న మాజీ సర్పంచ్ దివంగత వెంకటరమణ కుటుంబ సభ్యులు

- జన్మదినం సందర్భంగా ఒకేచోట కలుసుకున్న 88 మంది
- ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆటపాటలతో సందడి

మునగపాక: అమ్మ పుట్టిన రోజు అందరికీ పండగైంది. సపరివారసమేతంగా 88 మంది పెద్దలు, పిల్లలు చేరుకుని 80 ఏళ్ల మాతృమూర్తిని ఘనంగా సన్మానించి, ఆమె ఆశీసులు తీసుకోవడమేకాకుండా ఆటపాటలతో సందడి చేశారు. చిన్నచిన్న ఫంక్షన్ల సమయంలో వారిలో కొంతమంది అపుడప్పుడు కలుస్తున్నారు. అయితే ఈ సారి 88 మంది పిల్లలు, పెద్దలు కలుసుకోవడంతో వారి ఆనందాలకు అవధులు లేకుండా పోయాయి. మునగపాక మాజీ సర్పంచ్ దివంగత ఆడారి వెంకటరమణ భార్య పరదేశమ్మ 80వ పుట్టినరోజు సందర్భంగా మునగపాక రాధాకృష్ణ ఫంక్షన్‌హాలులో ఆత్మీయ కలయిక నిర్వహించారు. వెంకట రమణ–పరదేశమ్మ దంపతులకు కుమారులు లేరు. తొమ్మిది మంది కుమార్తెలు.1995లో రమణ మృతి చెందారు. తండ్రి రుణం తీర్చుకునేందుకు కూతుళ్లు ముందుకొచ్చి అప్పట్లో అంత్యక్రియలు నిర్వహించారు. పుట్టిన రోజు సందర్భంగా ఆ కూతుళ్లే తమ తల్లి పరదేశమ్మను ఘనంగా సత్కరించాలని నిర్ణయించి అందరినీ ఒకేచోట చేర్చి ఆత్మీయ కలయిక నిర్వహించారు. తొమ్మిది మంది కూతుళ్లకు సంబంధించి కొడుకులు, కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, మనుమలు, ముని మనుమలు ఇలా 88 మంది ఈ ఆత్మీయ కలయికకు హాజరయ్యారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ కలయిక కోసం అమెరికా, బిలాయి తదితర ప్రాంతాలనుంచి కుటుంబ సభ్యులు హాజరయ్యారు.తల్లి పరదేశమ్మను ఘనంగా సత్కరించారు.

క్లుప్తంగా

158 ఘటాలతో ఊరేగింపు



ఘటాలతో ఊరేగింపుగా వెళ్తున్న భక్తులు

అనకాపల్లిటౌన్: స్థానిక నెయ్యిలవీధి ప్రజలు 158 ఘటాలతో నూకాంబిక అమ్మవారి ఉత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి ప్రతీ ఇంటివద్ద అమ్మవారి పాటను ఏర్పాటు చేసుకుని ఆదివారం ఉదయం 8 గంటలకు నెయ్యిలవీధిలో వన్‌వే నుంచి ఘటాలను ఊరేగిస్తూ గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి చేరుకుని సమర్పించారు. గ్రామ ప్రజలు ఆరోగ్యం, సుఖ సంతోషాలతో జీవించాలని కోరుకుంటూ నెయ్యిలవీధి ప్రజలు ఏటా అమ్మవారి పండగను నిర్వహించడం ఆనవాయితీ.

బైక్ అపహరణపై కేసు నమోదు

మునగపాక : మండలంలోని టి.సిరసపల్లిలో బైక్ అపహరణకు సంబంధించి కేసు నమోదు చేసినట్టు ఏఎస్‌ఐ దొర తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. సిరసపల్లి గ్రామానికి చెందిన పిల్లా లక్ష్మీనారాయణ ఈ నెల 7వ తేదీన వ్యక్తిగత పనిపై అనకాపల్లి నుంచి స్వగ్రామం తన బైక్‌పై రాత్రి 10 గంటలకు వచ్చాడు. 8వ తేదీన ఉదయం 6 గంటలకు నిద్ర లేచి చూసేసరికి బైక్ కనిపించలేదు. దీంతో పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో లక్ష్మీనారాయణ మునగపాక పోలీసులకు ఆదివారం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఏఎస్‌ఐ దొర కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రారంభోత్సవాలకు వేళాయె!

- రూ.3 కోట్లతో పలు అభివృద్ధి పనులు పూర్తి
- నేడు హాజరు కానున్న డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్, ఎంపీ సత్యవతి



సచివాలయం, ఆర్బీకే కేంద్రాలకు నూతన భవనాలు

నాతవరం: నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ కృషితో నాతవరం ప్రగతి పథంలో దూసుకుపోతోంది. ఇప్పటికే కోట్లాది రూపాయలతో ఇంటింటికీ కుళాయిల ఏర్పాటు, రోడ్ల నిర్మాణం వంటి అభివృద్ధి పనులు జోరుగా కొనసాగుతున్నాయి. తాజాగా ఇక్కడ రూ.25 లక్షలతో నిర్మించిన రెండంతస్తుల గ్రామ సచివాలయం, రూ.35 లక్షలతో పశు వైద్యశాల నూతన భవనం, రూ.10 లక్షలతో వినాయకుడి ఆలయం, రూ.10 లక్షలతో నల్లకొండమ్మ తల్లి ఆలయంతోపాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవాలకు సిద్ధమయ్యాయి. వీటిని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ బి.వి. సత్యవతి సోమవారం ప్రారంభించనున్నారు.

దాత ఇచ్చిన స్థలంలో భవనాల నిర్మాణం

1959లో పీహెచ్‌సీ ఏర్పాటుకు నాతవరం ప్రధాన కూడలిలో అంకంరెడ్డి ఎరకయ్యనాయుడు మూడెకరాల భూమి విరాళంగా ఇచ్చాడు. అప్పట్లో జనాభా ప్రాతిపదికన నాలుగు పడకలతో పీహెచ్‌సీ నిర్మించి 1961 ప్రారంభించారు. ఆనాటి నుంచి నేటి వరకు దాని స్థాయి విస్తరించకపోవడంతో అరకొర వసతుల మధ్య కాలం వెళ్లదీస్తోంది. మిగిలిన స్థలం ఖాళీగా ఉండటంతో ఆక్రమణకు గురవుతుందని ప్రభుత్వ భవనాలు నిర్మించాలని దాత ఎరకయ్యనాయుడు మరణాంతరం కుమారుడు లచ్చన్న పలుమార్లు అధికారులు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక లచ్చన్న కుమారులు ఎమ్మెల్యే గణేష్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం మార్కెట్ ధర ప్రకారం రూ.15 కోట్ల విలువైన స్థలం ఆక్రమణలకు గురికాకుండా చూడాలని కోరారు. దానికి ఆయన స్పందించి ఏళ్ల తరబడి అభివృద్ధికి నోచుకోని పీహెచ్‌సీలోని ఖాళీ స్థలంలో రూ.2 కోట్లతో రోగులకు అవసరమైన అధునాతన సౌకర్యాలతో అదనపు భవనంతోపాటు ప్రహరీ నిర్మించారు. ఈ స్థలం గ్రామం మధ్యలో ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా ఉండటంతో రోడ్డు అవతల వైపు ఖాళీ స్థలంలో రూ.40 లక్షలతో గ్రామ సచివాలయ భవనం, రూ.25 లక్షలతో ఆర్బీకే భవనం నిర్మించారు. వీటిని కూడా మంత్రులు ప్రారంభించనున్నారు.

ప్రజల ఆశీస్సులు, సీఎం సహకారమే



కోట్లాది రూపాయలతో నాతవరంలో శాశ్వతమైన అభివృద్ధి పనులు చేశానంటే, ప్రజలు ఆశీస్సులు, సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సహకారంతోనే సాధ్యమైంది. కొత్తగా నిర్మించిన భవనాలను డిప్యూటీ సీఎం ముత్యాలనాయుడు, మంత్రి అమర్‌నాథ్‌లతో ప్రారంభించాలని గతేడాది వైఎస్సార్‌సీపీ నేత దివంగత అంకంరెడ్డి జమీలు కోరారు. ఈ లోపే ఆయన ఆకస్మికంగా మరణించారు. ఆయన ఆశయానికి అనుగుణంగా ఇద్దరు మంత్రులతో నూతన భవనాలు ప్రారంభిస్తుండటం ఆనందంగా ఉంది. – పెట్ల ఉమా శంకర్ గణేష్, ఎమ్మెల్యే

వసతి సమస్య తీరుతుంది



పీహెచ్‌సీలో అదనపు భవనాన్ని ప్రారంభిస్తే ఏళ్ల తరబడి వెంటాడే వసతి సమస్య తీరుతుంది. పీహెచ్‌సీ ఏర్పాటు సమయంలో నిర్మించిన గదిలోనే నాలుగు మంచాలపై రోగులకు వైద్య సేవలు అందిస్తున్నాం. ఇటీవల కలెక్టరు రవి పట్టాన్‌శెట్టి తనిఖీలో మేము పడే బాధలు స్వయంగా చూశారు.

– ప్రసన్న వైద్యాధికారి, నాతవరం పీహెచ్‌సీ

ఏర్పాట్లు పూర్తి చేశాం



కోట్లాది రూపాయలతో నిర్మించిన పలు అభివృద్ధి పనులు ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశాం. భవనాలు అందుబాటులోకి రానుండటంతో ప్రజలకు మరింత మెరుగ్గా సేవలందుతాయి.

– పోలుపర్తి పార్థసారథి ఇన్‌చార్జి ఎంపీడీవో

నిప్పుల వాన

- రాత్రి 8గంటలైనా తగ్గని వడగాడ్పులు
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న జనం



అనకాపల్లిలో గొడుగుతో వెళుతున్న యువతి

అనకాపల్లిటౌన్/చోడవరం: భానుడు నిప్పులు చిమ్ముతుండడంతో జిల్లా వాసులు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. గత కొద్ది రోజులుగా జిల్లాలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో ఎండవేడిని భరించలేక అల్లాడిపోతున్నారు. ఇంటి నుంచి కాలు బయటపెట్టడానికి కూడా భయపడిపోతున్నారు. రాత్రి వేళల్లో కూడా వేడి తగ్గకపోవడంతో జనం ఉక్కపోతకు గురవుతున్నారు. చోడవరం పరిసరాల్లో ఆదివారం కూడా 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కావడంతో జనం రోడ్లపైకి రాలేని పరిస్థితి ఏర్పడింది. వరుసగా రెండు రోజులుగా 43 డిగ్రీల ఉష్ణోగ్రతతో వడగాడ్పులు వీయడంతో వృద్ధులు, పిల్లలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. అనకాపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్‌లో ఆదివారం 43.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.మరో రెండురోజులు పాటు అధిక ఉష్ణోగ్రతలు కొనసాగే అవకాశం ఉందని ఆర్‌ఏఆర్‌ఎస్ శాస్త్రవేత్తలు చెప్పారు.

మెదడు ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి



మాట్లాడుతున్న న్యూరోసర్జన్ మళ్ల భాస్కరరావు, ఆయన్ను సత్కరిస్తున్న గ్రంథాలయ సభ్యులు

- అంతర్జాతీయ న్యూరోసర్జన్ మళ్ల భాస్కరరావు

అనకాపల్లి టౌన్: మానవుని శరీరంలోని సిగ్నలింగ్, కమ్యూనికేషన్ వ్యవస్థలను నాడీ వ్యవస్థ నియంత్రిస్తుందని అంతర్జాతీయ న్యూరోసర్జన్, బెంగళూర్ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసర్జరీ విభాగం పూర్వ ప్రధాన అధిపతి డాక్టర్ మళ్ల భాస్కరరావు తెలిపారు. శనివారం రాత్రి గవరపాలెం గౌరీ గ్రంథాలయంలో 'నరాల వ్యాధుల నివారణ చికిత్స' అంశంపై జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కొన్ని ఆరోగ్య పరిస్థితులు మెదడుకు సంచలనాన్ని కలిగించే నరాలను ప్రభావితం చేస్తాయన్నారు. మధుమేహం వల్ల 30 శాతం నరాల నొప్పులు వస్తాయన్నారు. అవయవాలు సరిగ్గా పనిచేయడానికి ఆరోగ్యకరమైన నాడీ వ్యవస్థ అవసరమన్నారు. రోగ నిర్ధారణకు నరాల బయాప్సీ చేయవచ్చన్నారు. మెదడుకు రక్త సరఫరా సక్రమంగా లేకపోతే ఫిట్స్, పక్షవాతం సోకుతుందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఏడు కోట్లమంది పక్షవాతంతో బాధపడుతుంటే, అందులో రెండు కోట్ల మంది భారతదేశంలో ఉన్నారని వాపోయారు. 60 నుంచి 70 శాతం మూర్ఛ వ్యాధిని మందులతో తగ్గించవచ్చని సూచించారు. మెదడు నిరంతరం చురుగ్గా పని చేయాలంటే రోజు అరగంట నడవడం, సంగీతం వినడం, యోగా, ధ్యానం చేయడం, ఆహార నియమాలు పాటించడం వంటివి అలవర్చుకోవాలన్నారు. మానవ శరీరంలో అన్ని భాగాలు మార్చవచ్చనని, మెదడును మార్చడం వీలుపడదని తెలిపారు. మెదడు ఆరోగ్యంపై ప్రతి ఒక్కరూ శ్రద్ధ చూపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అనంతరం గ్రంథాలయ సభ్యులు మళ్ల భాస్కరరావును శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైద్యులు ఎం.వి. బెనర్జీ, బి.వి.ఎం.ప్రసాద్, కె.అచ్చెన్నాయుడు, గ్రంథాలయం అధ్యక్షుడు డి.నూకఅప్పారావు, కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ, ప్రోగ్రాం కన్వీనర్ మళ్ల బాపునాయుడు, కోశాధికారి బి.కృష్ణఅప్పారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఆటోడ్రైవర్ దుర్మరణం

- మరో ముగ్గురికి గాయాలు



రోడ్డు ప్రమాదానికి గురైన ఆటో (ఇన్‌సెట్) ప్రమాదంలో మృతి చెందిన ఆటో డ్రైవర్ కిరణ్

ఎస్.రాయవరం : అడ్డురోడ్డు సమీపంలో జాతీయ రహదారిపై ఆటోను ఐషర్‌వ్యాను ఢీకొన్న ప్రమాదంలో ఆదివారం ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్‌ఐ ప్రసాద్‌రావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. అడ్డురోడ్డు జంక్షన్ నుంచి పాయకరావుపేట వెళుతున్న ఆటో అడ్డురోడ్డు సమీపంలో కోనవానిపాలెం జంక్షన్ వద్ద పెట్రోలు బంకుకి వెళ్లేందుకు మలుపు తిప్పడానికి ఆపాడు. ఇంతలో వెనుక నుంచి ఐషర్ వ్యాను ఢీకొట్టింది. దీంతో ఆటో డ్రైవర్ దొడ్డుగల్లు కిరణ్ (38) అవతలి రోడ్డుపై తూలి పడగా, ఎదురుగా లారీ వచ్చి ఢీకొట్టడంతో చక్రాలు కింద పడి నలిగి పోయి అక్కడిక్కడే మృతి చెందాడు. కొరుప్రోలు గ్రామానికి చెందిన కిరణ్‌కు ఏడాది క్రితం లక్ష్మి అనే యువతితో వివాహం జరిగిందని కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న పాయకరావుపేట మండలం పెంటకోట గ్రామానికి చెందిన డేగల చందు, డేగల వెంకటలక్ష్మి, జల్లూరి సౌమ్య తీవ్రంగా గాయపడ్డారు. వారిని ముందుగా స్థానికుల సహాయంతో నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనకాపల్లి తరలించినట్టు ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

ఐదెకరాల్లో తోటలు దగ్ధం



వాకపల్లిలో తగులబడుతున్న యూకలిప్టస్ తోట

- సుమారు రూ.4 లక్షల మేర ఆస్తి నష్టం

దేవరాపల్లి : మండలంలోని వాకపల్లిలో ఆదివారం జరిగిన అగ్ని ప్రమాదంలో సుమారు 5 ఎకరాల్లోని చెరకు కార్శి తోట, యూకలిప్టస్ తోట దగ్ధమైంది. మంటలను అదుపు చేసేందుకు గ్రామస్తులు ప్రయత్నించినప్పటికీ ఫలితం దక్కలేదు. ఎండ తీవ్రతతో మంటలు అదుపులోకి రాలేదు. దీంతో గ్రామానికి చెందిన ద్వారపురెడ్డి అచ్చిబాబు, సన్నిబాబు, కొట్యాడ సీతారాంకు చెందిన యూకలిప్టస్ తోట, పెంటకోట అప్పలనాయుడు, జనపురెడ్డి శ్రీను, కొప్పాక చిన్నంనాయుడుకు చెందిక కార్శి చెరుకు తోట అగ్నికి ఆహుతయ్యాయి. తమ కళ్ల ముందే ఆరుగాలం కష్టపడి పెంచిన తోటలు దగ్ధం కావడంతో కాపాడుకోలేక నిస్సహాయ స్థితిలో బాధిత రైతులు ఉండిపోయారు. ప్రభుత్వం తమకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధిత రైతులు కోరారు. ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు.

ఆత్మహత్యకు పాల్పడిన జగ్గన్నపేట వాసి మృతి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని జగ్గన్నపేటకు చెందిన బి.రవి అనే వివాహితుడు ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందాడు. ఈ నెల 6వ తేదీన రవికి అదే గ్రామానికి చెందిన ఇద్దరితో పురుషోత్తపురం వద్ద జరిగిన గొడవతో పాటు, జగ్గన్నపేటలో జరిగిన గొడవ కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్టు రవి కుటుంబ సభ్యులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

నర్సీపట్నం : నర్సీపట్నం మున్సిపాలిటీ పీనారపాలెం కేంద్రంగా యూత్‌కు గంజాయి విక్రయిస్తున్న బి.రాము(50) నుండి మూడు కిలోల గంజాయి స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్టు టౌన్ సీఐ ఎస్.గణేష్ తెలిపారు. రామును గతంలో గంజాయి కేసులో అరెస్టు చేశామన్నారు.

సారా విక్రేత అరెస్టు

నాటు సారా..అనధికార మద్యం బాటిల్స్ కలిగిన వ్యక్తులను అరెస్టు చేశామని సీఐ తెలిపారు. పెదబొడ్డేపల్లి ఏతపేటకు చెందిన పెంకి సత్యవతి(43) నాటు సారా విక్రయిస్తుండగా పట్టుకుని ఆమె వద్ద నుంచి నాలుగు లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. అలాగే పెదబొడ్డేపల్లికి చెందిన శివ గణరాజు(45) వద్ద నుంచి 9 మద్యం బాటిల్స్, ఎ.రమణ నుంచి 6 మద్యం బాటిల్స్ స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని సీఐ తెలిపారు.

వడదెబ్బకు ఇద్దరి మృతి



మొల్లి చంటి



బాబూరావు

నక్కపల్లి: వడగాడ్పులు తాళలేక ఇద్దరు మృతిచెందారు. దేవవరం గ్రామానికి చెందిన మొల్లి చంటి(56) ఉదయం కూలిపనులకు వెళ్లాడు. అస్వస్థతకు గురవడంతో ఇంటికి వచ్చేశాడు. ఇతని పరిస్థితి విషమించడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే లోగా మృతి చెందాడు.ఈ ఘటనపై కుటుంబ సభ్యులు సర్పంచ్ నర్సింహమూర్తి ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ శిరీష తెలిపారు.న్యాయంపూడికి చెందిన పిల్మాణి బాబూరావు(70) కార్పెంటర్‌గా పనిచేస్తున్నాడు. మధ్యాహ్నం పనిమీద బయటకు వెళ్లాడు. వడగాడ్పులకు అస్వస్థతకుగురయ్యాడు కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించే లోపు మృతిచెందాడు.ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు సర్పంచ్ రెడ్డి వరహాలు తెలిపారు. ఆదివారం మండలంలో వడగాడ్పులు తీవ్రంగా వీచాయి 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

మూడు దుకాణాల్లో చొరబడ్డ దొంగలు



దుకాణం పైకప్పు రేకులు పెకలించిన దృశ్యం

చోడవరం రూరల్ : పట్టణంలో చోడవరం–నర్సీపట్నం మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న మూడు దుకాణాల్లో శనివారం రాత్రి సమయంలో దొంగలు షాపుల పైకప్పు రేకుల్ని పెకిలించి చొరబడ్డారు. చోడవరం పోలీసుస్టేషన్‌కు ఎదురుగా, కోర్టుల సముదాయాన్ని ఆనుకుని ఉన్న రెండు వేర్వేరు దుకాణాలతో పాటు పట్టణానికి కిలోమీటర్ దూరంలో ఉన్న నర్సయ్యపేట గ్రామంలోని టైల్స్‌షాపులో ఒకే రీతిలో చోరీకి యత్నం జరగడంతో ఏదైనా ఒక ముఠా చోడవరంలో దిగిందా అన్న అనుమానం కలుగుతుంది. పట్టణంలోని దేవదాయశాఖ దుకాణం సముదాయంలోని పక్కపక్కనే ఉన్న జ్యోతి హార్డ్‌వేర్, జ్యోతి ఎలక్ట్రికల్ షాపుల్లో శనివారం రాత్రి దుకాణాలను మూసివేసిన యజమానులు ఆదివారం ఉదయం ఎప్పటిలా తెరవగా పెకప్పు రేకులు తొలగించి ఉండడంతో అవాక్కయ్యారు. క్యాష్ కౌంటర్లలోని సుమారు 500 రూపాయల చిల్లర దొంగల పాలు కాగా, కొన్ని సామాన్లను చిందర వందర చేశారు. ఇదే రీతిలో నర్సయ్యపేట వద్ద టైల్స్ హోల్‌సేల్ షాపులోను పైకప్పు రేకుల్ని తొలగించి లోనికి చొరబడినప్పటికీ ఎటువంటి సొత్తు చోరీ కాలేదని చెబుతున్నారు. కాగా పట్టణం నడిబొడ్డులో మెయిన్‌రోడ్డును ఆనుకుని ఉన్న దుకాణాల్లో దొంగలు చొరబడడం పట్ల పలువురు దుకాణదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాత్రిపూట పోలీసు గస్తీని అధికం చేయాలని కోరుతున్నారు.

మండుటెండలోనూ భక్తుల రద్దీ



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు



క్యూలైన్‌లో భక్తులు

- అనకాపల్లి నూకాంబికకు ప్రత్యేక పూజలు

అనకాపల్లి టౌన్: వేసవి ఉష్ణోగ్రతలను సైతం లెక్కచేయకుండా భక్తులు ఆదివారం గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయానికి పోటెత్తారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద ఎత్తున తరలి రావడంతో ఇక్కడ ఆలయంలో క్యూలైన్లు కిటకిటలాడాయి. కొంతమంది భక్తులు ఆలయ ఆవరణలో చలువ పందిళ్ల నీడలో వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. కుటుంబ సమేతంగా భోజనాలు చేసి అమ్మవారి ఆశీస్సులు పొందారు. పలు స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తులకు ఉచిత మజ్జిగ, తాగునీరు అందించాయి. ఆలయ కమిటీ సభ్యులు అమ్మవారి ప్రసాదాన్ని ఉచితంగా అందజేశారు. గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శనం కల్పించారు. బాలింతలు వారి పిల్లలకు పాలిచ్చేందుకు ప్రత్యేక గదులను ఏర్పాటు చేశారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షణలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐలు దాడి మోహనరావు, టి.శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ద్విచక్రవాహనాలను మాత్రమే అమ్మవారి ఆలయం వరకూ అనుమతించి, మిగిలిన వాహనాలను పార్కింగ్ ప్రదేశాల్లో నిలుపుదల చేశారు.

చెల్లిని మోసగించి తండ్రి ఆస్తి అమ్మకం...

అనకాపల్లిటౌన్ : తండ్రి ఆస్తిని మోసం చేసి అమ్మకాలు చేసిన ముగ్గురు వ్యక్తులపై పట్టణ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేసి విచారిస్తున్నట్టు ట్రాఫిక్ ఎస్‌ఐ దివాకర్ చెప్పారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలు... పట్టణంలో శ్రీరామ్‌నగర్‌కు చెందిన కొమర్తి అప్పారావు, లక్ష్మి దంపతులకు నాగలక్ష్మి, జగదీశ్వరి ఇద్దరు కుమార్తెలు. ఇద్దరికీ వివాహాలు చేశారు. అప్పారావుకు రెండు సెంట్ల స్థలంతో పాటు కొంత భూమి శ్రీరామ్‌నగర్‌లో ఉంది. 2018లో స్థలాన్ని పెద్ద కుమార్తె నాగలక్ష్మి భర్త కోటా శ్రీనివాసరావు, మరిది కోటా రాజులకు అప్పారావు, లక్ష్మి విక్రయించారు. సదరు స్థలంపై శ్రీనివాసరావు, రాజు పట్టణంలో ప్రైవేట్ బ్యాంక్‌లో రూ.5 లక్షలు అప్పుగా తీసుకున్నారు. 2021 మే నెలలో అప్పారావు, లక్ష్మి దంపతులు కరోనాతో మృతి చెందడంతో తండ్రి ఆస్తి దక్కించుకోడానికి నాగలక్ష్మి, జగదీశ్వరి కోటా శ్రీనివాసరావు, రాజులకు రూ.15 లక్షలు ఇచ్చేందుకు ఒప్పందం చేసుకున్నారు. రూ.పది లక్షలు దఫదఫాలుగా అందజేశారు. మిగిలిన రూ.5 లక్షలు బ్యాంక్ రుణం తీర్చుకొందామని ఒప్పందం కుదుర్చుకున్నారు. అయితే తల్లిదండ్రులు మృతిచెందిన తరువాత తహసీల్దార్ కార్యాలయంలో 2021 జూన్‌లో ఫ్యామిలీ సర్టిఫికేట్‌ను తీసుకున్నారు. అదే రోజు నాగలక్ష్మి తహసీల్దార్ కార్యాలయం నుంచి అప్పారావు, లక్ష్మి దంపతులకు ఒకే ఒక కుమార్తెగా పేర్కొంటూ ఫ్యామిలీ సర్టిఫికేట్ తీసుకుని రెండు సెంట్ల స్థలాన్ని మరో వ్యక్తికి అమ్మకం చేశారు. ఈ విషయం తెలుసుకున్న జగదీశ్వరి అక్క, బావ, అతని తమ్ముడిపై ఆదివారం పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఎస్‌ఐ చెప్పారు.

బస్సు ఢీకొని ఒకరికి గాయాలు

రాంబిల్లి: సెజ్‌లో యూనిపార్స్ కంపెనీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అప్పన్నపాలేనికి చెందిన ఎస్. సత్యనారాయణ గాయపడినట్టు ఎస్‌ఐ దీనబంధు తెలిపారు. బైక్‌పై వెళ్తున్న సత్యనారాయణను బస్సు ఢీకొట్టడంతో కాలు ఫ్రాక్చర్ అయింది. దీంతో అతనిని విశాఖపట్నం కిమ్స్ ఆస్పత్రికి తరలించారని, కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

క్లుప్తంగా

అభయాంజనేయుని విగ్రహ ప్రతిష్ట

కశింకోట : స్థానిక ద్వారపురెడ్డివారి వీధిలో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయ ప్రతిష్ట సందర్భంగా స్వామివారి విగ్రహాన్ని ఆదివారం రాత్రి ఊరేగించారు. స్థానిక రిక్షా స్టాండ్ నుంచి సంత బయల, ఉప్పునీటి దిబ్బల మీదుగా ద్వారపురెడ్డి వారి వీధి వరకు ఊరేగింపు నిర్వహించారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు, యువ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు రేజేటి మారుతి సహకారంతో కార్యక్రమాన్ని నిర్వహించారు. సోమవారం వేద మంత్రాల నడుమ శాస్త్రోక్తంగా స్వామి ఆలయ ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం అన్న సమారాధన జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వడగాడ్పులతో ఉక్కిరిబిక్కిరి



కశింకోటలోని గవరపేటలో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

కశింకోట : మండల ప్రజలు వడగాడ్పులతో ఆదివారం సతమతమయ్యారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు వేడి గాలుల తీవ్రత ఎక్కువగా ఉంది. దీంతో పాటు ఉష్ణోగ్రతలు కూడా భారీగా ఉండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడ్డారు. ప్రధానంగా వృద్ధులు, పిల్లలు ఇక్కట్లకు గురయ్యారు. ప్రజలు చాలా వరకు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో స్థానిక రోడ్లు నిర్మానుష్యంగా మారాయి.

స్వచ్ఛ భారత్‌కు ట్రాక్టర్ వితరణ



పంచాయతీ కార్యాలయానికి ట్రాక్టర్ అందిస్తున్న రవికృష్ణ

అనకాపల్లిటౌన్ : స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పాల్గొన్ని ప్రజలు ఆరోగ్యాన్ని సంరక్షించుకోవాలని శ్రీవాణి గ్రానైట్స్ క్వారీ యజమాని వై.రవికృష్ణ సూచించారు. మండలంలోని మామిడిపాలెం గ్రామంలో స్వచ్ఛభారత్ నిర్వహణకు తమవంతు సాయంగా ట్రాక్టర్‌ను ఆదివారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో నిరుద్యోగ యువతకు క్వారీలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. విధుల్లో ఉన్న కార్మికుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

25న యోగాసన పోటీలు

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు శ్రీరామచంద్ర మిషన్ హార్ట్‌ఫుల్‌నెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల 25న ఉదయం 7 గంటలకు యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు సెంటర్ ప్రతినిధి సతీష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎనిమిదేళ్ల నుంచి అరవయ్యేళ్ల వయస్సు కలిగిన వ్యక్తులు ఈ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	: రాజా
టక్కర్	: సత్యనారాయణ స్క్రీన్-1
పరేషాన్	: సత్యనారాయణ స్క్రీన్-2
ది కేరళ స్టోరీ	: షిర్డిసాయి
విరూపాక్ష	: పర్తిసాయి
అన్‌స్టాపబుల్	: వెంకటేశ్వర
యూనివర్సిటీ	: శ్రీసత్య
బిచ్చగాడు-2	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 21 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. బీ పాజిటివ్-5 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ నెగిటివ్-2 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్ బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 204 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 115 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

ఉగ్గినపాలెంలో ఎత్తిపోతల పథకం

ఉగ్గినపాలెం గ్రోయిన్.. దాదాపు 500 ఎకరాలకుపైనే ఆయకట్టుకు ప్రధాన సాగునీటి వనరు. అయితే ఏటా గండ్లు పడి, మరమ్మతులకు గురై ఆశించిన మేర సాగునీరందని స్థితి. దీంతో ఆయకట్టు రైతుల ఆశలన్నీ వరుణుడిపైనే..! వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రైతుల ఆశలు తీరనున్నాయి. గ్రోయిన్ మరమ్మతుల స్థానంలో రూ.2 కోట్లతో ఎత్తిపోతల పథకానికి సన్నాహాలు చేస్తుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



ఉగ్గినపాలెం గ్రోయిన్



గండిపడి మరమ్మతులకు నోచుకోని గ్రోయిన్

- మరమ్మతుల స్థానంలో కొత్త ప్రతిపాదనలు
- రూ.2 కోట్లతో ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణానికి సన్నాహాలు
- మంత్రి అమర్‌నాథ్ చొరవతో చురుగ్గా చర్యలు

కశింకోట : మండలంలోని శారదానదిపై తేగాడ గ్రామం వద్ద ఉన్న ఉగ్గినపాలెం గ్రోయిన్ స్థానంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడానికి అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. నది ప్రవాహ ఉధృతికి తరచుగా దెబ్బతింటున్న గ్రోయిన్‌కు మరమ్మతులు చేపట్టడానికి బదులు రైతుల కోరిక మేరకు ఈ పథకాన్ని నిర్మింస్తే, ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందడంతోపాటు అదనపు ఆయకట్టుకు కూడా ప్రయోజనం చేకూరనుంది.

బ్రిటీష్ కాలంలో నిర్మాణం

ఉగ్గినపాలెం గ్రోయిన్ కింద 500 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. కొత్తపల్లి, బుచ్చియ్యపేట, ఏఎస్ పేట తదితర గ్రామాలకు చెందిన భూములకు సాగునీరు అందించేందుకు బ్రిటీష్ హయాంలో దీన్ని నిర్మించారు. నది ప్రవాహ ఉధృతి కారణంగా తరచూ గ్రోయిన్‌కు గండ్లు పడుతున్నాయి. ఆయకట్టుకు ఏనాడూ పూర్తిస్థాయిలో సాగునీరు అందిన పరిస్థితి లేదని రైతులు చెప్తున్నారు. దీంతో వరుణుడిపైనే భారం వేసి సాగు చేస్తున్న రైతులు ఏటా ఎంతో కొంత మేర నష్టపోతున్నారు. గ్రోయిన్ తరచుగా దెబ్బతింటుండటం, తాత్కాలిక మరమ్మతులు చేపట్టినా ప్రయోజనం లేని పరిస్థితి నెలకొంది.

15 ఏళ్లలో అరకొర మరమ్మతులు

ఈ నేపథ్యంలో 2003లో అప్పటి మంత్రి దాడి వీరభద్రరావు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని శాశ్వత ప్రాతిపదికన రూ.30 లక్షలతో గ్రోయిన్‌కు మరమ్మతులు చేయించారు. నది ప్రవాహ ఉధృతికి ఆ భాగం మినహా, మిగిలిన గ్రోయిన్‌లో రెండు చోట్ల గండ్లు పడ్డాయి. దీంతో చాలా కాలం మరమ్మతులు చేపట్టకుండా అలానే వదిలేశారు. ఈ గ్రోయిన్ నిర్మాణంలో లోపం వల్లే తరచూ గండ్లు పడుతున్నాయని భావించిన ఇంజనీరింగ్ అధికారులు ఓ దశలో దీని డిజైన్ మార్చి పునర్నిర్మించాలనుకున్నారు. అందుకు సరిపడా నిధులు లేకపోవడంతో గత టీడీపీ ప్రభుత్వం 2018 జనవరిలో నీరు-చెట్టు కింద రూ.90 లక్షలతో మరమ్మతులు చేపట్టేందుకు ప్రతిపాదించారు. దీనిలో భాగంగా రూ.35 లక్షలు వెచ్చించి ఒక గండిని పూడ్చారు. బిల్లుల చెల్లింపు జరగకపోవడంతో కాంట్రాక్టర్ పనులను అర్ధాంతరంగా ఆపేశారు. మరో



వృథాగా పోతున్న నీరు

గండి పూడ్చకుండా అలానే వదిలేశారు. దీంతో అప్పటి నుంచి నీరు వృథాగా పోతోంది.

జగన్ ప్రభుత్వంలో శాశ్వత చర్యలు

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దీనికి శాశ్వత మరమ్మతులు చేపట్టేందుకు 2021లో నీటిపారుదల శాఖ అధికారులు రూ.89 లక్షలతో అంచనాలు వేశారు. అయితే తరచుగా దెబ్బతింటున్న గ్రోయిన్‌ను మరమ్మతులు చేపట్టేకంటే అనువైన చోట ఎత్తిపోతల పథకాన్ని నిర్మించి, సాగునీటి కాలువల ద్వారా ఆయకట్టుకు నీరందించాలని స్థానికులు కోరుతున్నారు. ఈ మేరకు ఈ ప్రాంత రైతులు రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు తమ అభ్యర్థన విన్నవించుకున్నారు. పైగా అదనపు ఆయకట్టుకు కూడా సాగునీరు అందగలదని పేర్కొన్నారు. దీంతో మంత్రి స్పందించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఐడీసీ) అధికారులతో చర్చించి పథకం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు. ఈ నేపథ్యంలో ఎత్తిపోతల పథకం నిర్మాణానికి అంచనాలు తయారు చేసి, ప్రభుత్వానికి నివేదించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందుకు సుమారు రూ.2 కోట్లు ఖర్చు కాగలదని అంచనా. ఇక పథకానికి నిధులు మంజూరై పనులు పూర్తి అయితే ఆయకట్టుకు పుష్కలంగా సాగునీరు అందగలదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

మరమ్మతులకు విరమణ

2021లో రూ.89 లక్షలతో మరమ్మతులకు ప్రతిపాదించాం. ఆయకట్టు రైతుల అభ్యర్థన మేరకు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఎత్తిపోతల పథకం నిర్మాణానికి ప్రతిపాదించారు. దీంతో ఉగ్గినపాలెం గ్రోయిన్ మరమ్మతుల యోచన విరమించాం. ఏపీఎస్ఐడీసీ ఆధ్వర్యంలో ఎత్తిపోతల పథకాన్ని నిర్మించడానికి అంచనాల తయారు చేస్తున్నారు. వారికి కావలసిన సమాచారాన్ని సమకూరుస్తున్నాం.

– హనుమంతరావు, ఏఈ, ఇరిగేషన్ సబ్ డివిజన్, అనకాపల్లి

నేడు గ్రామాల్లో మంత్రి అమర్‌నాథ్ పర్యటన

అనకాపల్లి రూరల్ : మండలంలోని సంపతిపురం, వెంకుపాలెం గ్రామాల్లో సోమవారం రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పర్యటించనున్నారు. ఈ రెండు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల కోసం నిర్మించిన కొత్త భవనాలను మంత్రి ప్రారంభించనున్నారు. ఈ మేరకు మండల పరిషత్, స్త్రీ శిశు సంక్షేమ శాఖల అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్కూళ్లతో పాటు దశలవారీగా అంగన్‌వాడీ కేంద్రాలకు సకల సౌకర్యాలతో సొంత భవనాలను నిర్మిస్తోంది. దీనిలో భాగంగా ఇక్కడ సుమారు రూ.15 లక్షలతో నూతన భవనాలు నిర్మించారు. ఈ భవనాలు అందుబాటులోకి రానుండటంతో ఈ కేంద్రాలకు వచ్చే చిన్నారులు, గర్భిణులు, బాలింతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

విద్యా కానుక కిట్ల పంపిణీ నేడు

కశింకోట : మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సోమవారం విద్యా కానుక కిట్లను పంపిణీ చేయనున్నట్లు ఎంఈవో చిట్టిబాబు ఆదివారం తెలిపారు. మండలంలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, కేజీబీవీలు, గురుకుల, ఆదర్శ పాఠశాలలు 57 ఉన్నట్లు పేర్కొన్నారు. వీటిలో చదువుతున్న విద్యార్థులకు కిట్లను అందించేందుకు వీలుగా ఇప్పటికే ఆయా పాఠశాలలకు చేరవేశామన్నారు. ఎండల తీవ్రత దృష్ట్యా వారం రోజులపాటు ఒంటిపూట తరగతులు నిర్వహిస్తామన్నారు.

పార్కింగ్ వాహనాలకు ఈ చలానాలు అన్యాయం

అనకాపల్లిటౌన్ : స్థానిక పూడిమడక రహదారిలో దుకాణాల ఎదురుగా పార్కింగ్ ప్రదేశాల్లో ఉన్న వాహనాలకు ఫొటోలు తీసి ఈ-చలానాలు పంపించడం అన్యాయమని స్థానిక వ్యాపారవేత్త ఎం.చిరంజీవి రమణ ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. నెహ్రూచౌక్ సమీపంలో 35 సంవత్సరాలుగా వ్యాపారం చేస్తున్నామని, ఇపుడు ట్రాఫిక్ పోలీసులు పార్కింగ్‌లో ఉన్న వాహనాలకు ఫొటోలు తీసి ఈ-చలనాలు పంపిస్తున్నారని ఆక్షేపించారు. దీనిపై ఉన్నతాధికారులు దృష్టిసారించాలని కోరారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు



గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సభలో మాట్లాడుతున్న ఎంఈవో చిట్టిబాబు



తాళ్లపాలెం గ్రంథాలయంలో విద్యార్థులకు ప్రశంసాపత్రాల అందజేత

కశింకోట : విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈవో వి.చిట్టిబాబు కోరారు. కశింకోట శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు సందర్భంగా ఆదివారం జరిగిన సభలో మాట్లాడారు. విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయానికి రోజూ వచ్చి విజ్ఞానదాయకమైన పుస్తకాలను చదివి విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. శిబిరంలో నిర్వహించిన వివిధ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు మండల వైస్ ఎంపీపీ పెంటకోట జ్యోతి, సర్పంచ్ మంత్రి జయరజని బహుమతులను అందించారు. కోదండ సీతారామచంద్రమూర్తి స్వామి ఆలయ కమిటీ మాజీ చైర్మన్ శిష్టి అప్పారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆంగ్ల వ్యాకరణ తరగతులు బోధించిన సూరా శ్రీనివాస్‌ను సత్కరించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు గ్రంథాలయానికి మైక్‌ను విరాళంగా అందించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు వై.రామచంద్రరావు, గ్రంథాలయ అధికారి వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

- మండలంలోని తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన కార్యక్రమ ముగింపు సభలో వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఉపాధ్యాయుడు సురేష్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు లగిశెట్టి భవాని, పంచాయతీ కార్యదర్శి వెంకటలక్ష్మి, పశు వైద్యాధికారి కె.భవనశ్రీ, వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిరసిస్తూ ఆందోళన



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న కార్యకర్తలు

పరవాడ: బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తూ అంబానీ, అదానీలకు సంపదను దోచి పెడుతుందని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ ఆరోపించారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనను నిరసిస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో పరవాడ సినిమాహాలు కూడలిలో ఆదివారం నిరసన కార్యక్రమం చేపట్టారు. విశాఖ రైల్వే జోన్, ప్రత్యేక హోదా ఇవ్వకుండా బీజేపీ ప్రభుత్వం మోసం చేసిందని గనిశెట్టి దుయ్యబట్టారు. 60 మంది బలిదానంతో ఏర్పడిన విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మాలని చూడడం దుర్మార్గమన్నారు. అమిత్ షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కె.నాయుడు, బి.అప్పారావు, జి.అప్పారావు, సీహెచ్.నాయుడు పాల్గొన్నారు.

ఆ పార్టీల వైఖరేంటో స్పష్టం చేయాలి

- ఉక్కు పోరాట కమిటీ నేతలు



850వ రోజు ఉక్కు దీక్షలో కేంద్రాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చి 850 రోజులు గడుస్తున్న రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల్లో ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేదని, కేంద్ర హోంమంత్రి అమిషా విశాఖ పర్యటన సంర్భంగానైనా అధికార, విపక్ష పార్టీలు ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా తమ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 850వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల కార్మికులు, భూనిర్వాసితులు, వారి కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలపై నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా వేల కోట్ల రూపాయల టర్నోవర్ చేసిన విశాఖ ఉక్కు పరిశ్రమకు ఈ ఏడాది ముడి సరుకు అందించకుండా నష్టాల వైపు నెట్టారని విమర్శించారు. తెలుగు ప్రజల బలమైన ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించే విధంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, విభాగాల సిబ్బంది, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

బ్రాండిక్స్‌లో 290 మందికి కంటి పరీక్షలు

10 మంది రక్తదానం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): బ్రాండిక్స్‌లో ఆదివారం 290 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 108వ కంటి వైద్య శిబిరాన్ని విశాఖ శంకర్ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. 208 మందికి ఉచితంగా కళ్లద్దాలు, 54 మందికి మందులు పంపిణీ చేశారు. 24 మందిని కాటరాక్ట్ సర్జరీ చేయించుకోవాలని సూచించారు. బ్రాండిక్స్ ఆధ్వర్యంలో రెడ్‌క్రాస్ సంస్థ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో 10 మంది రక్తదానం చేశారు. శిబిరాలకు విచ్చేసిన వారికి మధ్యాహ్న భోజనం, ఫలహారం, మజ్జిగ పంపిణీ ఏర్పాట్లు చేశారు.

13న పోతురాజుబాబు పండగ



ఉమ్మలాడలోని పోతురాజుబాబు

మునగపాక: మండలంలోని ఉమ్మలాడలో ఈ నెల 13న పోతురాజుబాబు పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు ఉత్సవకమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం నుంచి అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నా మని, అదే రోజు రాత్రి గ్రామంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలి వచ్చి పోతురాజుబాబును దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కమిటీ సభ్యులు కోరారు.

ఘనంగా అమ్మవారి ఒడ్డు పండగలు

మాడుగుల రూరల్: గ్రామాల్లో అమ్మవార్ల ఒడ్డు పండగలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. సాగరంలో మోదమాంబ అమ్మవారికి గుమ్మాల కొండలరావు కుటుంబ సభ్యులు ఒడ్డు పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు సతీమణి రమణమ్మ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్, ఎంపీటీసీ శ్రీనాథు సూర్యకాంతం, జగ్గారావు, నాయకులు పాము వెంకట్రావు, దేముళ్లు పాల్గొన్నారు. కె.జె.పురంలో మోదమాంబ ఆటో వర్కర్ల యూనియన్ ఆధ్వర్యంలో ఘటాల ఊరేగింపుతో మోదమాంబ పండగ నిర్వహించారు.


ఘనంగా సత్తెమ్మతల్లి పండగ

మునగపాక: మునగపాక దళితవాడలో ఆదివారం సత్తెమ్మతల్లి పండగ ఘనంగా జరిగింది. ఉదయం నుంచి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చారు. కాలనీవాసులంతా ఘటాలతో డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా వచ్చి పూజలు చేశారు.

ఈ సందర్భంగా భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీపీ జయలక్ష్మి, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, మార్కెట్‌కమిటీ చైర్‌పర్సన్ పిల్లి కనకలక్ష్మి అప్పారావు, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము, బోడకుర్తి గణేష్ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

‘ఉక్కు ప్రైవేటీకరణను విరమించుకోవాలి’

- అమిత్ షా పర్యటనకు నిరసనగా వామపక్షాల ఆందోళన



నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆందోళన చేస్తున్న వామపక్ష పార్టీల నేతలు

అనకాపల్లి రూరల్ : కేంద్ర హోం మంత్రి అమిత్ షా విశాఖ పర్యటనను వ్యతిరేకిస్తూ అనకాపల్లి పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద ఆదివారం వామపక్ష పార్టీల నేతలు నిరసన తెలిపారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఎందరో ఉద్యమకారుల బలిదానంతో ఏర్పడిన విశాఖ ఉక్కు పరిశ్రమను కార్పొరేట్లకు చౌకగా అప్పగించేందుకే కేంద్రం ప్రైవేటీకరణకు తెర తీసిందని ఆరోపించారు. ఏపీకి ప్రత్యేకంగా విశాఖకు తీవ్ర అన్యాయం చేసిన కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆక్షేపించారు. రాజకీయ అవసరాల కోసం ఏపీ ప్రజాప్రతినిధులను ఉపయోగించుకుంటోన్న బీజేపీకి భవిష్యత్తులో ప్రజలంతా తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. ఎర్ర జెండాలు ప్రదర్శిస్తూ అమిత్ షా గో బ్యాక్ అంటూ నినాదాలు చేశారు. ఈ ఆందోళనలో సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సీపీఎం సీనియర్ నాయకుడు ఎ.బాలకృష్ణ, సీపీఎం(ఎంఎల్) నాయకుడు పి.అజయ్ కుమార్, సీపీఎం నాయకులు గంటా శ్రీరామ్, బి.ఉమామహేశ్వరరావు, బుగిడి నూక అప్పారావు, ఐద్వా నాయకురాలు జి.సుభాషిణి, సీపీఐ నాయకులు రాజాన దొరబాబు, వియ్యపురాజు, తాకాసి వెంకటేశ్వరరావు, పాత్రపల్లి వీరూ యాదవ్ పాల్గొన్నారు.

నేడు ఆభయాంజనేయ స్వామి ఆలయ ప్రారంభోత్సవం



నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయం

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం శివారు హనుమాన్‌నగర్‌లో నూతనంగా నిర్మించిన శ్రీ అభయాంజనేయస్వామి ఆలయ ప్రారంభోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉదయం 7.25 గంటలకు హనుమాన్ ఉపాసకులు బ్రహ్మశ్రీ పెంట రమేష్ కుమార్ శర్మ అభయాంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట నిర్వహిస్తారని కమిటీ ప్రతినిధులు చెప్పారు. ఉదయం నుంచి ఆలయంలో మండప పూజలు, యంత్రశుద్ధి, వేదపారాయణం వంటి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ముఖ్య అతిథులుగా బ్రహ్మశ్రీ సుందర కాశేశ్వర శర్మ, బ్రహ్మశ్రీ దార్లపూడి వెంకటసీతారామశర్మ, బ్రహ్మశ్రీ భోగాపురపు బలరామకృష్ణ శాస్త్రి, బ్రహ్మశ్రీ జాడ హరీష్‌శర్మ, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం సర్పంచులు కూండ్రపు వరలక్ష్మీసీతారామయ్య, సీహెచ్ సుజాత ముత్యాలు పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమంలో పరిసర గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆలయ కమిటీ ప్రతినిధులు కోరారు.

గుర్తుకొస్తున్నాయి

20 ఏళ్ల తర్వాత కలిసిన పూర్వ విద్యార్థులు



2000-02 బ్యాచ్ ఇంటర్ పూర్వ విద్యార్థులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాల పూర్వ విద్యార్థులు రెండు దశాబ్దాల తర్వాత ఆదివారం కలిశారు. ఒకరిని ఒకరు ఆప్యాయంగా పలకరించుకుని నాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అరేయ్.. ఒరే అని పిలుచుకుని విద్యార్థుల్లా మారిపోయారు. ఆనాటి మధుర స్మృతులను,చిలిపి తగాదాలు, జ్ఞాపకాలను మననం చేసుకున్నారు. తమ కుటుంబాల బాగోగులను అడిగి తెలుసుకున్నారు. సబ్బవరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 2000-2002 విద్యా సంవత్సరం మధ్య ఇంటర్ చదువుకున్న విద్యార్థులంతా కళాశాల ఆవరణలో కలుసుకుని ఆట పాటలతో అలరించి సందడి చేశారు. పూర్వ విద్యార్థులు విశ్వనాథ్,రాజేష్,కిశోర్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

గురుకులాలకు ఐదుగురు విద్యార్థుల ఎంపిక



ఎంపికైన విద్యార్థులతో సర్పంచ్, ఉపాధ్యాయులు

మాకవరపాలెం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థులు గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారు. పైడిపాల ప్రాథమికోన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు ఐదో తరగతి ప్రవేశాలకు పరీక్షలు రాశారు. వీరిలో జ్ఞానతేజశ్రీ, డి.ప్రియవర్షిణి, కె.మహితేజ, పి.వరుణ్, శీరం సుమిత్ర పరవాడ మండలం తానాం, భీమిలి, అచ్యుతాపురం, యలమంచిలి, అనకాపల్లిలో గురుకుల పాఠశాలలకు ఎంపికయ్యారని ఉపాధ్యాయుడు కె.ఎస్.ఆర్.మూర్తి ఆదివారం తెలిపారు. ఒక్క పాఠశాల నుంచే ఐదుగురు విద్యార్థులు ఎంపికయ్యేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను సర్పంచ్ రత్తల జ్యోతి అభినందించారు. బాగా చదువుకుని గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.